


# పాట మూగబోయింది...

నీవులేవు
నీవిప్పుడు మా మధ్యన లేవు
నీవు మాత్రమే లేవు
కానీ....
ఈ నేలపై నువ్వు చిలకరించిన
అక్షరాల చినుకులే
ఉరవడి పదాలై
పాటల వరదలై
భావుకుల గుండెల్లో
ఎన్నటికీ ఇంకిపోని
జీవ నదీ నదాలయ్యాయి
నీవు లేవు
నీవు మాత్రమే మా మధ్యన లేవు

ప్రబంధ పదబంధాలను
పుట్ట తేనెలా పిండి
తేట తెలుగు మాటల
పూత రేకులు చుట్టి
మాకందించావు

వెదురు కొమ్మను విరిచి
ఏడు స్వరాలు పొడిచి
పైరగాలిని పిలిచి
గాన గంధర్వాన్ని
మోగించావు

ఆరు రుతువుల రాగాలను
ఆరు రుచులుగా చేసి
వెండితెర గిన్నెలో
పిండివెన్నెల కలిపి
గారాల గోరుముద్దలు
ఆరారగా తినిపించి
అల్లారు ముద్దుగా వినిపించావు

సొగసు కీల్జెడ, సోగకన్నుల
జానుతెలుగు జాణ చుట్టిన
శ్రీనాథుని కప్పూర విడెము సేవించి
శృంగార అంగారాన్ని వెలిగించావు

మందార మకరందాల మాధుర్యాల
పోతన కయితలతో
గోపెమ్మ కన్నుల వెన్నెలలో
బృందావన గోవిందుని అర్చించావు

అన్నమయ్య అలతి పదాలకు
క్షేత్రయ్య వెండి మువ్వలు తొడిగి
త్యాగయ్య కృతులలో ఆకృతి దాల్చి
వన్నెల కిన్నెరసానికి
వెన్నెల పైటలు వేసి
గోదారి తీరాల్లో
రాదారి పాటలు పాడించావు

పాలకంకి వంటి పిల్ల ఎంకిని పిలిచి
సిరికాకొలను చిన్నదానితో జతపెట్టి
మచిలీపట్నం మాయాబజారులో
కుర్రకారుకు కిర్రెక్కించావు

పాటల పచ్చని పందిళ్లు వేసి
కోయిలమ్మకు రాగాల మేనా కట్టి
సన్నజాజుల సన్నాయి
చిలకపాట, నెమలి ఆట
మేజువాణి పెట్టి
గోరింటాల పేరంటాలకు
బంతిపూల పారాణి రాసి
వసంతుణ్ణి వరుడిగా తెచ్చిన
ఐదు రోజుల పెళ్లికి
అచ్చ తెలుగు విస్తళ్లు వేసి
పాటల పంచామృతాన్ని వడ్డించావు

అక్షయ అక్షర తూణీరం నుంచి
మాటలు మంత్రాలు
కవన సమ్మోహనాస్త్రాలు
సూటిగా మా మదిలో నాటి
ఇన్నాళ్లు మమ్మల్ని
సంభ్రమాశ్చర్య ఆనంద పారవశ్యుల్ని
చేశావు

ఇప్పుడు నీవు లేవు
నీవు మాత్రమే మా మధ్యన లేవు

పాటల తోటమాలి ఇక లేడని
వెన్నెల ఎండల్ని కాసింది
మల్లెలన్నీ వాడి తెల్లబోయాయి
కోకిల శోకాలు తీసింది
మధుర స్వరాలూదే
గాన మోహన మురళి
మూగ వెదురుగ మిగిలి
గాలి గగనాన్ని చేరింది!

**-పెద్దిరెడ్డి గణేష్**